ప్రజాశక్తి
మంగళవారం 24 సెప్టెంబర్ 2024

అల్లూరి సీతారామరాజు

మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి

ప్రజాశక్తి-హుకుంపేట : నూతన మద్యం పాలసీతో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ప్రభుత్వం వెంటనే మద్యాన్ని నిషేధించాలని ఆదివాసి గిరిజన మహిళ సంఘం జిల్లా కమిటీ నాయకురాలు ఎస్ ఐమావతి డిమాండ్ చేశారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, మద్యం మత్తులో మహిళలు వేధింపులు, చిత్రహింసలకు గురౌతున్నారని, కుటుంబాలు అస్తవ్యస్తమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వావివరుసలు తేడాలేకుండా లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా పూర్తిగా మద్యాన్ని నిషేధించాలని, యువత ఈ మహమ్మారికి బానిసలు కాకుండా చూడాలన్నారు. బ్రాండ్లపేరుతో జనాలను మభ్య పెట్టడం మానుకుని, పూర్తిగా మద్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మద్యాన్ని ఆదాయ వనరుగా కాకుండా, ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు చేపట్టాలన్నారు. మద్యాన్ని నిషేధించి మహిళలు, యువత భవిష్యత్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు.

అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారం

● జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించి బాధితులకు తగిన న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ బాధితులకు పరిహారం అందించడంలో జాప్యాన్ని నివారించాలన్నారు.. పాడేరు, చింతపల్లి, పాడేరు సబ్ డివిజన్ల పరిధిలో కేసుల పరిష్కారంపై అధికారులతో చర్చించారు. 2022 -24 మధ్య మూడేళ్లలో నమోదైన కేసులు, పరిష్కారమైనవి, అపరిష్కృతంగా ఉన్నవి, పరిహారం చెల్లింపులపై ఆరా తీశారు. పాడేరు డివిజన్ పరిధిలో 12, చింతపల్లిలో 12, రంపచోడవరంలో19, చింతూరు డివిజన్ పరిధిలో 9 కేసులను నమోదు చేశారని, ఇప్పటి వరకు 11 కేసులకు రూ.11,35 లక్షల పరిహారం అందించారన్నారు. చార్జిషీటు వేసిన 4 కేసులకు రూ.2.50లక్షలు చెల్లించారన్నారు. విశాఖపట్నం, కాకినాడ జిల్లాల పరిధిలోని అల్లూరి జిల్లా కేసులకు ఇక్కడి కలెక్టరేట్‌కు బదిలీకి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భూతగాదాల కేసుల్లో అసలు హక్కుదారులను గుర్తించి త్వరతగతిన పరిష్కరించాలన్నారు. అత్యాచారం, హత్య కేసుల్లో బాధితులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వభూమిని ఇవ్వాలని, లేకుంటే కొనుగోలు చేసి ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒలకు సూచించారు. సెలవుల్లో ఇళ్లకు వెళ్లి తిరిగొచ్చిన ఆశ్రమ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. కొన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా చికెన్, మటన్లతో వంటలు చేసి పెడుతూ, విద్యార్థులకు మెనూ అమలు చేయడం లేదని కలెక్టర్ దృష్టికి వచ్చిన నేపథ్యంలో తగు చర్యలకు ఆదేశించారు. ఐసిడిస్, గిరిజన సంక్షేమ శాఖ (విద్య) అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అమిత్ బర్దార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, ఐటిడిఎ పిఒలు వి.అభిషేక్, అపూర్వ భరత్, సబ్ కలెక్టర్లు శౌర్యమన్ పటేల్, కల్పశ్రీ, డిఆర్‌ఒ బి.పద్మావతి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి. జనార్ధనరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డిడి. ఎల్.రజని, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒ నాగరాజు, కమిటీ సభ్యులు, బాలు అవేసా, చెండా లోహితాస్, ఎస్.రాజారావు, సీతారాం, సూపరింటెండెంట్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న కాఫీ కార్మికులు, హెల్పర్స్

ప్రజాశక్తి పాడేరు: కాఫీ కార్మికులు, హెల్పర్స్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కాఫీ కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి సుందరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మినుములూరు కాఫీ కార్మికుల కాలనీలో సమావేశం అనంతరం సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సుందరరావు మాట్లాడుతూ కాఫీ పళ్ళ సేకరణకు ముందుగానే రోజు వారి కూలి, పండ్ల సేకరణ రేట్లు ప్రకటన చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న హెల్పర్లకు కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు.

ఎపిసి వ్యవస్థను రద్దు చేసి, సిబ్బందిని నియామకం చేపట్టాలన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పదివేల హెక్టార్లలో కాఫీ తోటల్లో సీజన్ అండ్ ఆన్ సీజన్‌లో పనిచేస్తున్న వేలాది మంది కాఫీ కార్మికులకు నేటికీ కనీస వేతనం లభించడం లేదన్నారు. జిల్లాల విభజన అనంతరం అల్లూరి జిల్లాలో ప్రధానంగా కాఫీ తోటలు వాణిజ్య పంటగా నేడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అప్పటికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికులకు, హెల్పర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వకపోగా, అదనపు పని భారంతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో క్షేత్రస్థాయిలో వివిధ విభాగంలో పీల్డ్ సిబ్బంది సుమారు 300మంది వరకు ఉండేవారని, ఉద్యోగ విరమణ, వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేయకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పడుతోందన్నారు. కార్మికులు, హెల్పర్స్ అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇపిఎఫ్, టిఎ,డిఎ సమస్యల పరిష్కారం, వారాంతపు పేమెంట్లు, క్వార్టర్స్ మరమ్మతులు, కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, తోటల్లో ప్రమాదం జరిగితే మెడికల్ ఖర్చులు యజమాన్యమే భరించడం వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐదు డివిజన్ల పరిధిలోని కాఫీ హెల్పర్స్, కాఫీ కార్మికులు సుందర్ కుమార్, వెంకటేష్, దేవరాజు, నాగేశ్వరావు, కాంతారావు, బాలకృష్ణ, మోహన్, అప్పారావు, రామారావు, బాబూరావు, కాంతమ్మ పాల్గొన్నారు.

వైసిపి కేంద్ర కార్యాలయంపై దాడి హేయం

ప్రజాశక్తి -పాడేరు: తిరుపతి లడ్డూ నాణ్యత సమస్యను ఆసరా చేసుకొని బిజెపి అనుబంధ బిజెవైఎం కార్యకర్తలు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంపై దాడి చేయడం హేయమని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి. అప్పలనర్స అన్నారు. వైసిపి కార్యాలయంలపై బిజెవైఎం దాడిని సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.సంఘపరివార్ శక్తులు ఒక పథకం ప్రకారం తిరుపతి లడ్డూ సమస్యను ఆసరా చేసుకొని, మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. . శాంతిభద్రతలను పరిరక్షించి, మత సామరస్యాన్ని కాపాడాలన్నారు. తిరుపతి దేవస్థానం లడ్డు కల్తీ వివాదంపై సమగ్ర విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ముస్లిం యువకుని ఔదార్యం

- చట్రాపల్లి, మూలగరువు బాధితులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - చింతపల్లి : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే సంతృప్తి ఉందని చింతపల్లికి చెందిన ముస్లిం యువకుడు షేక్ ఉమర్ (చిన్న) అన్నారు. ఇటీవల భారీ వర్షాలతో జీకే వీధి మండలం గూడెం, గాలికొండ పంచాయతీలలోని మూలగరువు, చట్రాయిపల్లి గ్రామాలలో వరద విలయంతో సర్వం కోల్పోయి నిరాశ్రయులుగా మిగిలిన గిరిజన కుటుంబాలకు తనవంతు సాయంగా బాధితులకు రగ్గులు దుస్తులు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపద ఎవరికి వచ్చినా ఆదుకునే మనస్తత్వం ప్రతి వ్యక్తికి ఉండాలన్నారు. ప్రకృతి ప్రకోపంతో నష్టపోయిన బాధితులకు నలుగురం నాలుగు విధాలుగా సహాయం చేస్తే బాధితులకు ఊరట లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, దినసరి కార్మికుల రెగ్యులరైజేషన్‌కు

30న కలెక్టరేట్ వద్ద ధర్నా

జయప్రదం చేయాలి : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -పాడేరు: కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, దినసరి కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈనెల 30న సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులంతా హాజరై జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు సోమవారం పాడేరులో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగు సంఘం నాయకులు జయరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ సుందరరావుతో కలిసి దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఐటిడిఎ, గిరిజన కార్పొరేషన్, మెడికల్ అండ్ హెల్త్, విద్యాశాఖ, ఎన్ ఆర్ జి ఎస్, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులాలు, విద్యుత్, ఆర్‌టిసి, ఏపీ టూరిజం, కాఫీ బోర్డు వంటి ప్రభుత్వ సర్వీసులో వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా, వారికి సరైన వేతనాలు ఇవ్వడం లేదని, తీవ్రమైన పని ఒత్తిడితో పని చేస్తున్నారని అన్నారు. గౌరవవేతనం, కంటిజ్జెన్స్, గెస్ట్, అగ్రిమెంట్ క్యాజువల్ పీస్ రేటు వంటి పేరుతో పనిచేయించుకుంటున్నారన్నారు. చట్ట ప్రకారం వీరందరినీ రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు . కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, పిఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఈనెల 30న కార్మికుల రెగ్యులరైజేషన్‌కు ఉద్యమించాలని సిఐటియు పిలుపునిచ్చిందన్నారు.

అల్లూరి స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమం

● ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న బాలదేవ్

ప్రజాశక్తి -హుకుంపేట: గిరిజన హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి అల్లూరి స్ఫూర్తితో ఉద్యమాన్ని ఉధృతం చేద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐద్వా మహిళా సంఘం, సిఐటియు, సిపిఎం, దండకారణ్య విమోచన సమితి, గొండ్వన దండకారణ్య పార్టీ, దండకారణ్య విద్యార్థి సమితి, తదితర ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్‌సమావేశం నిర్వహించారు. 1 /70, పీసా,ఇతర గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు, జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, చట్టబద్ధత కల్పించడం,. ఏజెన్సీ ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి ప్రకటన డిమాండ్లపై చర్చించారు.

స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో పి. సోమన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసులు డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వాలుపట్టించుకోవడం లేదని, ఇష్టారాజ్యంగా గనులు, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులిస్తున్నార న్నారు. అక్రమ కట్టడాలపై ఆదివాసులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 1/70 చట్టంపై ఉద్యమిస్తున్న ఎమ్మెల్యేకు సంఘం తరపున స్వాగతిస్తున్నామన్నారు. డిఎల్‌ఒ రాష్ట్ర అధ్యక్షులు పి.రంజిత్ కుమార్ మాట్లాడుతూ, హుకుం పేట మండలంతోపాటు ఇతర మండలాల్లో అక్రమ నిర్మాణాలపై స్థానిక ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలన్నారు. ఐటిడిఎలో ఉన్న 1056 ఉపాధ్యాయ పోస్టులను గిరిజనులతో భర్తీ చేయాలని, స్పెషల్ డిఎస్‌పిపై స్పష్టతనివ్వాలన్నారు. ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకురాలు హైమావతి మాట్లాడుతూ ఏజెన్సీలో సర్వహక్కులు ఆదివాసులకే ఉండాల్సిన నేపథ్యంలో వాటిని హరిస్తూ, గిరిజనేతరులకు కట్టబెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి కృష్ణారావు మాట్లాడుతూ అక్రమ నిర్మాణదారులపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణరావు, ఆదివాసీ గిరిజన సంఘం మాజీ మండల కార్యదర్శి కె.ఆనంద్. దండకారణ్య విద్యార్థి సమితి జిల్లా కన్వీనర్ కె వెంకటరాజు, జిడిపి అరకు ఇంచార్జి సిహెచ్ రాజు, ప్రసాద్, బాలన్న,వంశీ, నరసింహమూర్తి, చంద్రబాబు, మహిళా సంఘం నేతలు ఈశ్వరమ్మ, పుష్ప, నీరజ పాల్గొన్నారు.

అవగాహన ఉన్న వారినే

పీసా కమిటీలకు ఎన్నుకోవాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాష్ట్రంలో షెడ్యూల్ ప్రాంతంలో సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 8 వరకు పీసా గ్రామసభలు జరుగుతున్న నేపథ్యంలో అవగాహన ఉన్న వ్యక్తులను పీసా కమిటీల చైర్మన్లు, కార్యవర్గాలకు ఎన్నుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పీసా గ్రామసభ ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం ఉండకూడదని, ఆ గ్రామంలో ఆదివాసీలు ఎన్నుకునే స్వేచ్ఛ ఇవ్వాలని, రాజకీయ పార్టీల జోక్యం లేకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు. గ్రామసభ జరుగు గ్రామంలో మూడు వంతుల హాజరు కచ్చితంగా ఉండాలని, మొక్కుబడి గ్రామసభలు నిర్వహించవద్దని పేర్కొన్నారు. గ్రామసభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని, చదువుకున్న యువత ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలని కోరారు. ఆదివాసీ చట్టాలు, హక్కులు, జీవోలు, రక్షించబడాలంటే పీసా గ్రామసభ తీర్మానం చాలా ముఖ్యమని, పంచాయతీ తీర్మానం కన్నా విలువైనదని పేర్కొన్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన పీసా కమిటీల ఎన్నికలో ఆదివాసీలందరూ పాల్గొని రాజకీయాలకు అతీతంగా హక్కుల కోసం పోరాడే వ్యక్తులను, చట్టాలపై అవగాహన ఉన్న వారిని అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా ఎన్నుకోవాలని కోరారు. లేకుంటే గిరిజనులకు, ఏజెన్సీ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

లోతా రామారావు

మిడ్డేమీల్స్, స్కూల్ శానిటేషన్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో చేసిన మార్పులకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, స్కూల్ శానిటేషన్ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కె.శాంతిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం మిడ్డేమీల్స్‌కు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చడంతో పాటు మెనూలో కూడా కొన్ని మార్పులు చేసిందని, వీటిని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న నిత్యావసర వస్తువుల ధరలను పరిగణనలోకి తీసుకొని చేసిన మార్పులకు అనుగుణంగా మెనూ చార్జీలు ఒక్కొక్కరికి రూ.20 చొప్పున చెల్లించాలని కోరారు. ఇంకా కొన్ని పాఠశాలల్లో వంట షెడ్డులు లేకపోవడంతో ఆరుబయట, చెట్ల కింద వంట చేయవలసి వస్తుందని, కొన్ని పాఠశాలల్లో వంట పాత్రలు కార్మికులే కొనుగోలు చేసి వంట చేస్తున్నారని చెప్పారు. వంట షెడ్లు నిర్మించాలని, వంట పాత్రలు సరఫరా చేయాలని, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. స్కూల్ శానిటేషన్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి బకాయిలు చెల్లించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఒకే రకమైన యూనిఫారంతో వంటలు చేయాలని, శానిటేషన్ పనులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దానికి అనుగుణంగా కార్మికులకు రెండు జతల (కాటన్) చీరలు, శానిటేషన్ సామగ్రిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మిడ్డేమీల్స్ కార్మికులకు గౌరవ వేతనం పెంచాలని, వంట నిర్వహణకు అవసరమైన గ్యాస్ సిలిండర్లను, కందిపప్పు, చింతపండు, పామాయిల్ తదితర సరుకులను సివిల్ సప్లై ద్వారా సరఫరా చేయాలని కోరారు. కార్మికులపై వేధింపులను ఆపాలన్నారు. ఈ సమస్యలపై ఐటిడిఎ పిఒ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కార్మికులు కళింకోట మంగయమ్మ, కె.కుమారి, ఎస్.పద్మ, కె.వీరాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న మిడ్డేమీల్స్, శానిటేషన్ కార్మికులు

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 90 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)కు విశేష స్పందన లభించింది. రోడ్లు, వంతెనలు నిర్మాణం చేయాలని, పాఠశాలలకు ప్రహరీలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ఆర్‌ఒఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని, రబ్బర్ పాలు ప్రాసెసింగ్‌కు పరికరాలు ఇవ్వాలని, సెల్ టవర్ ఏర్పాటు చేయాలని వంటి సమస్యలపై ప్రజలు 90 అర్జీలు సమర్పించారు. వీటిని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం, ఏపీఒ డిఎన్‌వి.రమణ స్వీకరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ బాబురావు, తహశీల్దారు కృష్ణ జ్యోతి, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఇందిరా, డియల్‌డిఓ కె.కోటేశ్వరరావు, పిహెచ్‌ఓ చిట్టిబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ భూమి ఇచ్చి ఆదుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు

ఇటీవల వరదలకు గిరిజన రైతులు ఎంతైతే భూమి కోల్పోయారో అంతే భూమి మరోచోట ఇచ్చి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. జీకే వీధి మండలం గుమ్మిరేవులు, దారకొండ పంచాయతీల పరిధిలోని ధారాపురం, మాదిగమల్లు, కమ్మరితోట, దార్లగొంది, తోకరాయి, నిమ్మచెట్టు తదితర గ్రామాల్లో సోమవారం సిపిఐ నాయకులు పర్యటించి వరద బాధిత కుటుంబాలను పరామర్శించారు. వరదల్లో కొట్టుకుపోయిన పంట భూములు, ఇళ్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం సిపిఐ తరుపున రెండోసారి 300 వరద బాధిత కుటుంబాలకు ఒక్కో బాధిత కుటుంబానికి 25 కేజీలు బియ్యం, బట్టలు, నిత్యవసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి వరదల్లో జరిగిన నష్టాన్ని ఇప్పటివరకు అధికారులు అంచనా వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. రెవెన్యూ పట్టాలు ఉన్న భూములకు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని, ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు, పట్టా లేకుండా సాగు చేసిన రైతులకు ఇచ్చేది లేదని వ్యవసాయశాఖ అధికారి చెప్పడం దారుణమన్నారు. పట్టా ఉన్నా లేకపోయినా పంటలు నష్టపోయిన రైతులకు కచ్చితంగా ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరదలు కారణంగా ఎక్కడైన ఇల్లు కోల్పోతే రూ.25000, పాక్షికంగా దెబ్బతింటే రూ.10000 ఆర్థిక సహాయం అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, జీకే వీధి మండలంలో 6 పంచాయతీల్లో వరద బీభత్సానికి ఇల్లు కోల్పోయిన వారికి ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆరు పంచాయతీల్లో వరదలకు నష్టపోయిన రైతులకు భూమికి భూమి ప్రత్యామ్నాయంగా ఏర్పాటుచేసి, ఇల్లు కోల్పోయిన వారికి ఇంటి నిర్మాణం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మచెట్టు గ్రామంలో వరదలకు కొట్టుకుపోయిన పంట పొలాల పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర నేత సత్యనారాయణమూర్తి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఈనెల 30వ తేదీన రంపచోడవరంలో జరిగే జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రికను ఐటిడీఏ పీవో కట్టా సింహాచలం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నైపుణ్యాభివద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గవర్నమెంటు డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో నాలుగు కంపెనీలకు పాల్గొంటాయని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాల కోసం ఈ క్రింది తెలిపిన ఫోన్ నెంబర్లను 6304634447, 6281618037 సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు టి.ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో స్థానిక మసీధోనియా చర్చి వద్ద కొండ కాలువ కల్వర్టుపైకి ప్రవహించడంతో మారేడుమిల్లి నుండి బోదులూరు వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు సుమారు ఐదు గంటల పాటు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం ఆకస్మాత్‌గా ఆకాశం మేఘావృతమే ఉరుములతో కూడిన కుండపోత వర్షం కురిసింది.

మారేడుమిల్లి మసీధోనియా చర్చి దగ్గరలో ఉన్న బ్రిడ్జి పై నుండి ప్రవహిస్తున్న కొండవాగు

జి.మాడుగులలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న జెసిబి

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి- యంత్రాంగం

పెదబయలు : మండల.కేంద్రం సీతగుంట పంచాయతీ 11 గ్రామాల్లో రోడ్డు కిరువైపులా విపరీతంగా పెరిగిన పిచ్చిమొక్కలను పంచాయతీ తీర్మానంతో స్థానిక సర్పంచి పలాసి మాధవరావు వైస్ సర్పంచ్ బొండా గంగాధరం ఆధ్వర్యంలో దగ్గరుండి మూడురోజులుగా కూలీలు పెట్టి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. పంచాయతీని ఆదర్శంగా, పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయంగా ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా పిచ్చిమొక్కలు తొలగిస్తున్నట్లు తెలిపారు.

జి.మాడుగుల : మండలంలో బొయితిలి పంచాయతీ మద్ది గరువు గ్రామంలో స్థానిక సర్పంచ్ మాలన్న ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, మురుగు కాలువల్లో చెత్తను జెసిబి సాయంతో సోమవారం తొలగించారు . సంత జరిగే ప్రదేశంలో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి పారిశుధ్య పనులను చేపట్టారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ తమర్బ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి , వార్డు మెంబర్లు పాల్గొన్నారు

ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి

ప్రజాశక్తి- అరకులోయ : వివిధ సమస్యలపై దండా కారుణ్య ఎంప్లాయిస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవులుకు సోమవారం వినతి అందజేశారు. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్సీకి ర్గనైజేషన్ ప్రతినిధులు ఎల్బీ కామేశ్వరరావు, ప్రకాష్, మంజునాథ్ సి వినతిపత్రం సమర్పించారు. గిరిజన ప్రాంతంలో జిఒ 3 పునరుద్ధరణ చేయాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పూర్తి కాల వార్డెన్లను, నర్సులను నియమించాలని, ఆశ్రమ పాఠశాలలో చేరిన విద్యార్థులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉపాధ్యాయ నియామకాలు ప్రమోషన్లలో ఎస్టీ రోస్టర్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఐదో షెడ్యూల్ గిరిజన ప్రాంతాలలో 100 శాతం ఉపాధ్యాయ నియామకాలు ప్రమోషన్లు ఆదివాసుల చట్టాలు, హక్కులను అనుసరించి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అరకు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి సియారి దొన్నుదొర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు

ప్రజాశక్తి- పెదబయలు : మండల కేంద్రంలో వారపుసంత రోజున వాహన రాకపోకలు అధికమైన నేపథ్యంలో మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పాదచారులు, బైకిస్టులు, ఇతర వాహనదారులు ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని, స్థానిక పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణ, క్లియరెన్స్‌కు చర్యలు చేపట్టారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వైద్యకమిటీ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ఆశ్రమ పాఠశాలల్లోని గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. హాస్టళ్లలో ఇటీవల జరిగిన మరణాలపై ఆరా తీసారు. సోమవారం వైద్య శిబిరాలు నిర్వహణ, సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహణపై ఐటిడిఎ పిఒలు, వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, గురుకులం అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన విద్యార్థుల వైద్య సేవలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులను వైద్యాధికారులు సక్రమంగా అబ్జరేషన్లో ఉంచకుండా డిశ్చార్జ్ చేస్తే, అనంతరం అనుకోని సంఘటన జరిగితే సంబంధిత వైద్యాధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థగా ఉంటే వెంటనే ఐటిడిఎకు సమాచారం అందించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో చేరిన విద్యార్థి కోలుకున్నాక ఆశ్రమపాఠశాలకు పంపించాలని, ఇంటికి పంపించ కూడదన్నారు. జాయింట్ కలెక్టర్ నేతత్వంలో వైద్య పరీక్షల కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో సిక్ రూం ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. . విద్యార్థులకు వార్షిక వైద్య పరీక్షలు నిర్వహణకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆసుపత్రికి వెళ్లే ముందు తలిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థుల హెల్త్ రికార్డులను నిర్వహించాలని సూచించారు. జ్వరం, బి.పి. చెకింగ్ పరికరాలను ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తామని, సిక్ రూం నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు, డిప్యూటీ వార్డెన్లకు శిక్షణ అందిస్తున్నామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్, ఐటిడిఎ పిఒలు వి. అభిషేక్, కె.సింహాచలం, డిఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారావు, డిఇఒ డాక్టర్ సాధన, ఉప సంచాలకులు ఐ. కొండలరావు, 11 మండలాల సహాయ గిరిజన సంక్షేమాధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలి

క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ప్రజాభిప్రాయాల సేకరణ : కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్-2047 లక్ష్యసాధనలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో స్వర్ణాంధ్ర@2047 విజన్ అభివృద్ధికి సమగ్ర కసరత్తు చేపట్టిందన్నారు. రాష్ట్ర ఆర్థిక, సామాజికాభివృద్ధి, వాతావరణ సుస్థిరతలపైన దృష్టి సారిస్తూ 2047నాటికి దేశ స్థూలవృద్ధి కేంద్రంగా ఎపిని తీర్చిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను నిర్దేశిస్తుందని కలెక్టర్ వివరించారు. నవంబరు ఒకటినాటికి విజ్ 2047 పత్రాన్ని ఆవిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. 2047 నాటికి దేశానికి మార్గదర్శకంగా, పేదరికంలేని సమాజం, నైపుణ్యం గల యువత, అందరికి ఆరోగ్యం, సుసంపన్నమైన సమాజం రాష్ట్రంలో ఉండాలన్న లక్ష్యంతో జిల్లాలోని కీలక రంగాలపై దృష్టి సారించి శాఖలవారీగా ఈ నెల 30వ తేదీలోగా మండల విజన్ ప్రణాళికలు, వచ్చేనెల 15లోగా జిల్లా విజన్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర 2047 పై గ్రామసభల ద్వారా, ముఖ్యమంత్రి వీడియో సందేశం ద్వారా, కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రతి ఇంటికీ సమాచారం చేరవేసి, అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అభివృద్ధి ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వాములై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలన్నారు. అందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, వెబ్‌సైట్‌లో డిస్‌ప్లే అయ్యే స్కానర్ ఇమేజ్ ద్వారా అభిప్రాయాలను చెప్పాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై ఫీడ్ బ్యాక్ నమోదుకు స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, క్రమపద్ధతిలో వివరాలను నమోదు చేయాలని సూచించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేశాక పార్ట్-1లో ముందుగా పేరు నమోదు చేయాలి. మొబైల్ నంబర్‌ను నమోదు చేయండి ఓటిపి మొబైల్‌కి పంపబడుతుంది. ఒటిపిని నమోదు చేయండి. ధవీకరించండి. జిల్లా పేరు, వయస్సు, లింగం, వృత్తి, ఇ.మెయిల్, చిరునామా ఇతర వివరాలను నమోదు చేయండి

పార్ట్-2లో సూచనల కోసం ప్రశ్నావళిలో 1 నుండి 10 వరకు ప్రశ్నలు ప్రదర్శించబడతాయి. అందులో కనిష్టంగా ఒకటి, గరిష్టంగా మూడు ప్రశ్నలను ఎంపికలను ఎంచుకోవాలి. 11వ ప్రశ్నలో ఏవైనా సూచనలు, ఆలోచనలను మూడు వేల పదాలకు మించకుండా నమోదు చేయాలి. తర్వాత సబ్మిట్ పై క్లిక్ చేయాలి. దీంతో ముఖ్యమంత్రి ఫొటోతో పాటు సంతకం చేసిన సర్టిఫికేట్ జనరేట్ అవుతుంది. తర్వాత సర్టిఫికెట్ మీ మొబైల్, సిస్టమ్ స్టోరేజీలో డౌన్‌లోడ్ చేయబడుతుంది. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఫైబర్ నెట్ సేవలను మెరుగుపరచండి

ప్రజాశక్తి-హుకుంపేట: అస్తవ్యస్తంగా ఉన్న ఫైబర్‌నెట్ సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో మెరుగుపరిచి ప్రజలకు సేవలు అందించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు. మండల కేంద్రంలో మూడు నెలలుగా లబ్ధిదారులకు పూర్తి సౌకర్యం అందడంలేదని, మూడు నెలల బిల్లులు చెల్లిస్తే రెండు నెలలే ఇంటర్నెట్ అందిందని, లైవ్ ఛానళ్ల టెలీకాస్ట్ అగమ్యగోచరంగా ఉందని వాపోతున్నారు. ఫైబర్ నెట్ యాజమాన్యం డబ్బులు ముక్కుపిండి వసూలు చేస్తున్నా, లబ్ధిదారులకు ఇంటర్నెట్, ఇతర సౌకర్యాలను సరిగా అందించడం లేదన్నారు. దీనిపై సంబంధిత ఉన్నతస్థాయి యంత్రాంగం దృష్టి పెట్టి చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఆశ్రమ విద్యార్థులకు వైద్యసేవల్లో నిర్లక్ష్యం

ప్రజాశక్తి -పాడేరు : గిరిజన సంక్షేమ ఆశ్రమ విద్యార్థులకు వైద్యసేవల కల్పనలో తీవ్ర నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని వైసిపి గిరిజన సమాఖ్య నాయకులు కూడా రాధాకృష్ణ, జెడ్‌పిటిసి కూడా బొంజి బాబు, మాజీ ఎంపిపి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమాల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రుల్లో చేర్పించి, తర్వాత వారి తల్లిదండ్రులకు అప్పగించి పాఠశాలల యాజమాన్యాలు చేతులు దులుపుకుంటున్నాయని మండిపడ్డారు. గిరిజన సంక్షేమ, ఐటిడిఎ ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం వల్లే విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సిటి స్కాన్ లేకపోవడం వల్ల వ్యాధి నిర్ధారణలో జాప్యం, విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. పాడేరు ఆసుపత్రిలో పూర్తిసౌకర్యాలను కల్పించాలన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్ కొండబాబు, విశ్వనాథం యువరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి -జి.మాడుగుల: మావోయిస్టు ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో స్థానిక సిఐ వెంకటరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉరుము జంక్షన్ వద్ద సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానిత వ్యక్తులను విచారించి విడిచిపెట్టారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకుంటా రాకపోకలు సాగించాలన్నారు. వర్షాలకు రోడ్డు ఎక్కడికక్కడ దెబ్బతినడంతో అతివేగంగా వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులకు సూచించారు . అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే తమకు సమాచారం అందివ్వాలని కోరారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందేలా బోధన

ప్రజాశక్తి-మధురవాడ : సైన్స్ కోర్సులలో గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలలో పట్టు ఉన్నప్పుడే సాంకేతిక ప్రగతి సాధ్యపడుతుందని ఈ దృష్ట్యా పాఠశాల స్థాయిలోనే విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా విద్యాబోధన జరగాలని హైస్కూల్ అధ్యాపకులకు భౌతిక శాస్త్రంలో నూతన అంశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో నిపుణులు సూచించారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం, నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ విభాగం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో కలసి రెండురోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.విజయభాస్కర్ మాట్లాడుతూ పాఠశాలలలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి అటల్ టింకరింగ్ ప్రయోగశాలలతో పాటు స్టెమ్‌ల్యాబ్‌లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సైన్స్ ప్రయోగశాలల ద్వారా విద్యార్థులలో శాస్త్ర విజ్ఞానం పట్ల జిజ్ఞాసను అధ్యాపకులు పెంచాలన్నారు. విద్యార్థులలో మేధస్సును పెంచి సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం ఇన్‌స్పైర్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తుందని పేర్కొన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రాథమిక శాస్త్రాలపై అవగాహన లేనిదే సాంకేతికంగా పురోభివృద్ధి సాధించలేమన్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ ఎస్.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సైన్స్ ప్రయోగాలను వర్చ్యువల్‌గా విద్యార్థులకు నేర్పించడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విజయచంద్రశేఖర్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోరువానలోనూ వాటర్ లీకేజీలను అరికడుతున్నకార్మికులు

జోరు వానలోనూ మరమ్మతులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం కుట్రవాడ హెడ్ వర్క్ వద్ద శ్రీసత్య సాయి మంచినీటి పథకం కార్మికులు సోమవారం జోరు వానలోనూ లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతు పనులు చేశారు. ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు 22 నెలల నుండి జీతాలు చెల్లించలేదు. అయినప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో సోమవారం వారు జోరు వానను కూడా లెక్కచేయకుండా లీకేజ్ వర్కులను పూర్తి చేసి మంచినీళ్ళు సరఫరా చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సత్యసాయిబాబా వాటర్ సిబ్బందికి జీతాలు చెల్లించాలని స్థానిక గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రోడ్లు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : దేవీపట్నం మండలం తున్నూరు గ్రామంతో పాటు మారుమూల గ్రామాలకు తారు రోడ్లు మంజూరు చేయాలని తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్‌కు ఆదివాసీ జెఎసి నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్న దొర, కుండ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేములకొండ గ్రామం నుండి తున్నూరు గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్డు మొత్తం గోతులమయంగా ఉండటంతో వర్షాకాలంలో ప్రజలు చాలా ఇబ్బందులు

కెజిహెచ్‌లో మరిన్ని సదుపాయాల కల్పన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం కెజిహెచ్‌లో సుడిగాలి పర్యటన చేపట్టారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానందతో కలిసి వివిధ విభాగాలలో ఉన్న రోగులను ప్రత్యక్షంగా పరామర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజులలో మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. మాజీ మంత్రి భాట్టం శ్రీరామమూర్తి కోడలు భారతీదేవి సొంత నిధులతో కెజిహెచ్‌లో కార్డియాలజీ వార్డులో సమకూర్చిన ఇసిజి మానిటర్, బిపి ఆపరేటర్లును మాజీ ఎమ్మెల్యే ఎస్‌కె.రెహమాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖలో బదిలీలు జరిగాయి. విశాఖపట్నంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.సుజాతకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇక్కడే ఉప కమిషనర్‌గా నియమించారు. ఆదివారం రాత్రి ఇచ్చిన జిఒలో కనక మహాలక్ష్మి ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ భాధ్యతలను కూడా అప్పగించారు. అయితే సోమవారం సాయంత్రానికి మారిన ఉత్తర్వుల మేరకు దేవదాయ శాఖ హెడ్ ఆఫీస్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.శోభారాణిని కనకమహాలక్ష్మి ఆలయ ఇఒగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.ముందుగా ఆమెను మహానంది ఈవోగా నియమించారు. కనకమహా లక్ష్మి దేవస్థానం ఇఒగా పనిచేస్తున్న పి.శ్రీనివాసుల రెడ్డిని నెల్లూరు జిల్లా పెంచలకోన లక్ష్మి నరసింహ దేవస్థానం ఇఒగా నియమించారు. విశాఖపట్నం జిల్లా సహాయ కమిషనర్ కె.శిరీషను విజయనగరం జిల్లా ఎసిగా నియమిస్తూ విశాఖపట్నంలోని సంపత్ వినాయగర్ ఆలయ ఇఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అనకాపల్లిలోని నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.అన్నపూర్ణను విశాఖపట్నం జిల్లా ఎసిగా నియమించారు. కనకమహాలక్ష్మి ఆలయ ఎఇఒ వి.రాంబాబు, ఎఇ సూర్యనారాయణ మూర్తిలను సింహాచలం దేవస్థానానికి బదిలీ చేశారు. విశాఖపట్నం జిల్లా ఇన్‌స్పెక్టర్‌గా అనకాపల్లిలో పనిచేస్తున్న కె.శ్రీధర్‌ను నియమించారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి- అరకులోయ :గడిచిన వంద రోజులలో కూటమి ప్రభుత్వం అందరూ మెచ్చేలా పాలనను అందించిందని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు అన్నారు. సోమవారం మండలం పెదలబుడు పంచాయతీ లిట్టిగూడ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించాలన్నదే కూటం ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత వైసిపి ఐదేళ్ల కాలంలో స్థానిక సంస్థలను, పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. పంచాయతీలకు వచ్చిన నిధులను పక్కదోవ పట్టించారన్నారు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కృషితో కేంద్రం నుంచి రూ.1800 కోట్ల నిధులు పంచాయతీలకు విడుదలయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, సెక్రటరీ ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ అజరయ్య, గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు డోంబు చంద్రశేఖర్, కిల్లో లైకోన్ పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మార్చుకోండి : ఎమ్మెల్సీ చిరంజీవి

దుంబ్రిగుడ: అధికారుల పనితీరులో గత ప్రభుత్వ ఛాయలు ఇంకా వీడలేదని, ఇప్పటికైనా అధికారులు పనితీరు మార్చుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవి స్పష్టం చేశారు. సోమవారం జంగిడి వలస గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజలు సమస్యలతో అధికారులు దగ్గరకు వస్తే వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి పనులను చేసే విధంగా అధికారులు, ఉద్యోగులు వ్యవహరించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజుల్లో పింఛన్లు పెంపుదల, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు వంటి ఎన్నో హామీలను నెరవేర్చిందన్నారు.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన పనులపై గిరిజనులకు అవగాహన పరుస్తూ ప్రచారం నిర్వహించారు.కార్యక్రమంలో అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎస్ దొన్ను దొర, టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, వి నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ నాయకుడు చిరంజీవి, ఎంపిటిసి దేవదాసు, ఎంపీడీవో బి ఉషారాణి, టి ఎన్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం

జంగిడివలసలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవి

కార్యక్రమం సోమవారం మారేడుమిల్లి మండలం సున్నంపాడు, దేవరపల్లి గ్రామాల్లో నిర్వహించారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు యువత నియోజకవర్గం నాయకులు భాస్కర్ చేస్తున్న సేవా కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో పలు గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెల్లిబోయిన శ్రీనివాసు, సర్పంచ్ వెలుగురి చిన్న లచ్చిరెడ్డి, ఎంపిటిసి మడకం అనిల్ కుమార్, ఏవో జయంతి, పట్లాల రాజ్ కుమార్ రెడ్డి, గురుకుశేష్ కుమార్, మల్లా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరు పెద్ద భీంపల్లి ఆర్ఆర్ కాలనీ మంటూరు పరగసానిపాడు గ్రామల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం అధికారులు సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి, ఎంపీడీవో రత్నకుమారి, ప్రత్యేకాధికారి ప్రశాంతి, కూటమి నాయకులు మట్ట మెహర్ బాబా గౌడ్, ముచ్చు నాగేశ్వరరావు దాకారపు సత్యనారాయణ, లంక హరిచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : అభివృద్ధి సంక్షేమం టిడిపి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు అన్నారు. మండలంలోని మారేడుబాక పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 100 రోజుల్లో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జిచిన్నాలమ్మ, నాయకులు కొచ్చా కాసులమ్మ, కోసూరి మల్లిరెడ్డి, వడుగుల నాగరాజు, కించి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో ఫీజు రాయితీ కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో 50 శాతానికిపైగా ఫీజు రాయితీ కల్పించాలని, పెండింగ్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరుతూ సోమవారం విశాఖ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు జర్నలిస్టు సంఘాలు వినతి పత్రాన్ని అందజేశాయి. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ కింద జర్నలిస్టుల ప్రీమియం చెల్లింపునకు సిఎస్ఆర్ నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపాయి. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు అధికంగా ఉండటం వల్ల జర్నలిస్టులకు భారం కలుగుతోందని కలెక్టర్‌కు నాయకులు తెలిపారు. గతంలో విశాఖ జిల్లాతో పాటు కొన్ని జిల్లాల్లో ఫీజు రాయితీ కల్పిస్తూ మెమో ఉత్తర్వులు జారీ చేశారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ ఏడాదీ ఆ విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.సత్యనారాయణ, ఎపియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షులు కె.చంద్రమోహన్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎం.కీర్తన్, ఎపిజెయు అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీధర్, ఎం.శ్రీహరి పాల్గొన్నారు.

చీటీల మోసకారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి, గాంధీనగర్ పరిసర ప్రాంతాలలో చీటీలు, సాయిరాం గోల్డ్ లక్కీ డ్రా మొదలగు స్కీమ్‌లతో అధిక లాభాలు ఆశ చూపి 540 మంది నుంచి డబ్బులు వసూలు చేసి రూ.14 కోట్లు మేర మోసం చేసిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, సివిల్ కాంట్రాక్టర్ సిల్లా ప్రసాదరావు కుమార్తె కంచి మాధవి, ఆమె కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. వారంతా సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మోసం చేసిన వారి ఫొటోలు, అందుకు సంబంధించిన పత్రాలను బాధితులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కొలుపూరి నారాయణమ్మ, అమ్మాజీ, కొట్యాడ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పీపుల్ నేషనల్ కన్వెన్షన్‌కు మేయర్, డిప్యూటీ మేయర్‌లకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరాల ఆర్థిక ప్రగతి, ప్రజల జీవన విధానంపై ఢిల్లీలో జరిగే పీపుల్ నేషనల్ కన్వెన్షన్ - 2024కు రావాలని విశాఖ మేయర్, డిప్యూటీ మేయర్‌లకు ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

సమావేశానికి హాజరైన వాల్తేరు రైల్వే డివిజన్ పరిధిలోని ఎంపీలు

రైలు సర్వీసులు, సౌకర్యాలపై విస్తృత చర్చ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ పార్లమెంటు సభ్యుల సమావేశం విశాఖలో సోమవారం ఉదయం ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ అధ్యక్షతన జరిగింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పది మంది ఎంపీలు హాజరయ్యారు. ఈ కమిటీ చైర్మన్‌గా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును నామినేట్ చేసింది. అనంతరం జరిగిన సమావేశంలో రైల్వే మౌలిక సదుపాయాలు, ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. రైలు సర్వీసులు, స్టాప్‌లు వంటి అంశాలపైనా చర్చ జరిగింది. సభ్యులు పలు సూచనలు, సలహాలు అందించారు. వాల్తేరు డివిజన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. రైలు ఫ్రీక్వెన్సీని పెంచడం, సేవలను విస్తరించడం, కొత్త లైన్లను నిర్మించడం, రోడ్ అండర్ బ్రిడ్జిలు, రోడ్ ఓవర్ బ్రిడ్జిలను అభివృద్ధి చేయడం వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయి. సమావేశంలో రాజ్యసభ ఎంపీలు గొల్ల బాబూరావు, ముజిబుల్లా ఖాన్, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీ భరత్, అరకు ఎంపీ జి.తనుజరాణి, నవరంగాపూర్ ఎంపీ బలభద్ర మఝ్హి , విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, కోరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్కా, బ్రహ్మపూర్ ఎంపీ డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, బస్తర్ ఎంపీ మహేష్ కశ్యప్, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ పాల్గొన్నారు.

డిఎస్‌సికి ఉచిత కోచింగ్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : పిడి, పిఇడి ట్రైనింగ్ పొందిన ఆదివాసీ పట్టభద్రులకు రంపచోడవరం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇప్పించాలని ఐటిడిఏ పిఒ కట్టా సింహాచలంకు సోమవారం ఎపి ఆదివాసీ జెఎసి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఉచిత కోచింగ్‌తో పాటు వసతి కల్పించి స్టడీ మెటీరియల్ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర, మడకం వరప్రసాద్ దొర, కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సిఇఒగా నారాయణమూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా పరిషత్ సిఇఒగా పి.నారాయణమూర్తి నియమితులయ్యారు. ఆయన కాకినాడలో డిఎల్‌డిఒగా ఇప్పటి వరకూ పనిచేశారు.

అటవీశాఖ అధికారిగా వెంకటరావు

ప్రజాశక్తి - సీలేరు : జీకే.వీధి మండలం సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారిగా ఎస్.వెంకటరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటరావు కేడీపేట అటవీశాఖ రేంజ్ అధికారిగా ఇప్పటి వరకు విధులు నిర్వహించారు. సీలేరులో మూడు సంవత్సరాలుగా అటవీశాఖ రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసరావును కేడీ.పేటకు బదిలీ చేసింది.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాల్సిందే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ జగదాంబ జంక్షన్‌లో బ్లాక్ డే నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పు చేశారని విమర్శించారు. అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.